సాక్షి విశాఖపట్నం

శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



ఎం.వి.జాగ్ రాధకు..

గ్రేట్ ఈస్ట్రన్ షిప్పింగ్ కంపెనీకి చెందిన ఎం.వి.జాగ్ రాధ ఓడను 5 రోజుల్లో షిప్ యార్డ్ మరమ్మతులు పూర్తి చేసింది. 8లో



పాస్‌పోర్టు సేవలు ఫాస్ట్.!

పాస్‌పోర్టు సేవలు మరింత సులభతరం చేసేందుకు విదేశీ మంత్రిత్వ శాఖ అనేక సరికొత్త చర్యలకు ఉపక్రమించింది. 11లో

క్రికెటర్ ఈశ్వర్ ఇకలేరు



జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి చెందిన క్రికెటర్ సోముదల ఈశ్వర్(40) కన్ను మూశారు. 8లో

న్యూస్‌రీల్

8 నుంచి గవర్నర్ అబ్దుల్ నజీర్ పర్యటన



సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ నగరంలో పర్యటించనున్నారు. ఈ నెల 8వ తేదీన విశాఖకు చేరుకోనున్నారు. 9న జరిగే సమాచార కమిషనర్ల సదస్సుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సును గవర్నర్ ప్రారంభించనున్నారు. అదేవిధంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగే పలుకార్యక్రమాలతో పాటు నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో గవర్నర్ హాజరుకానున్నారు. 11వ తేదీన అబ్దుల్ నజీర్ తిరుగు ప్రయాణం కానున్నారని కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లలో అధికారిక వర్గాలు నిమగ్నమయ్యాయి.

మహిళా ఎస్ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు



లాంగ్ జంప్ చేస్తున్న మహిళా అభ్యర్థి

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్.ఐ నియామకాలు కోసం మహిళా అభ్యర్థులకు నిర్వహిస్తోన్న దేహదారుఢ్య పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. పరుగు, లాంగ్ జంప్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండో రోజు జరిగిన ఈ పోటీలు కోసం 685 మందికి హాల్ టికెట్లు పంపగా 539 మంది హాజరయ్యారు. రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ సమక్షంలో జరిగిన ఈ పోటీలను విజయనగరం జిల్లా ఎస్పీ దీపిక, రేంజ్ పరిధిలో అదనపు ఎస్పీలు, నోడల్ ఆఫీసర్లు డీఎస్పీలు పర్యవేక్షించారు.

రేపటి నుంచి జాతీయ సంగీత నాటకోత్సవాలు

మద్దిలపాలెం: జాతీయ సంగీత నాటకోత్సవాలు శనివారం నుంచి మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నిర్వహిస్తున్నామని విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమి అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయరాజు, డాక్టర్ వీఆర్‌కే ప్రసాద్ తెలిపారు. గురువారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగీత నాటకోత్సవాలను ఈనెల 7వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు అపర త్యాగరాజు పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామికి నాద విద్యాభారతి పురస్కారం అందిస్తున్నట్టు ప్రకటించారు. జాతీయ పురస్కారంతో పాటు రూ.లక్ష బహుమతి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప రాష్ట్రపతి డాక్టర్.ఎం.వెంకయ్యానాయుడు, నావికాదళ వైస్ అడ్మిరల్ జి.శ్రీనివాస్‌లు హాజరవుతారని తెలిపారు.

నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మినీ జాబ్‌మేళా

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయి కృష్ణ చైతన్య, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శోభారాణి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి ప్రారంభం కానున్న మినీ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు డబ్ల్యూఎస్ఎస్, ఎస్ఎన్ఎఫ్ ఇండియా, ఫినో పేమెంట్ బ్యాంక్‌తో ఇంటర్వ్యూలు ఉంటాయని, విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో అర్హులైన నిరుద్యోగులు మినీ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని చెప్పారు. డిగ్రీ, బీఎస్సీ కెమిస్ట్రీ, డిప్లొమో కెమికల్ పూర్తి చేసిన వారు ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చని, ఎంపికైన వారికి అర్హతల ఆధారంగా రూ.15 నుంచి రూ.20వేల వరకు జీతభత్యాలు ఉంటాయని తెలిపారు. విశాఖ జిల్లాలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని, 18 నుంచి 30 ఏళ్లలోపు వారు హాజరుకావచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98484 38254 నంబరులో సంప్రదించవచ్చు.

ప్రయాణికుల సౌకర్యార్థం మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం : ఎక్కువ మంది ప్రయాణికుల అరకు అందాలను వీక్షించేందుకు వీలుగా ప్రయాణికుల సౌకర్యార్థం మరో విస్టాడోమ్ కోచ్‌ను తాత్కాలికంగా జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్‌కు సెప్టెంబరు 2, 3 తేదీలలో, కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు సెప్టెంబరు 3,4 తేదీలలో అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జతచేస్తున్నారు.

• రాజన్నకు రాఖీ



రాఖీ పండగ సందర్భంగా ఆశీలమెట్టలోని వేమన మందిరం ఆవరణలో దివంగత నేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి 27వ వార్డు వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు గొలగాని లక్ష్మి రాఖీ కట్టారు. ప్రతి ఏడాది రాజన్న విగ్రహానికి రాఖీ కడుతున్నట్టు ఆమె తెలిపారు. ఈకార్యక్రమంలో నందిని, మానస, గౌతమి, రత్నకుమారి, త్రిపుర పాల్గొన్నారు. - సీతమ్మధార



జీవీఎంసీ కమిషనర్‌కు రాఖీ కట్టిన మేయర్

నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావుకు రాఖీ కట్టారు. - డాబాగార్డెన్స్

రోజుకు రూ.కోటి

- రైళ్ల రద్దు.. ఆర్టీసీకి రద్దీ..!
- బస్సుల్లో ఊపందుకున్న ప్రయాణికుల తాకిడి
- డిమాండ్ మేరకు దూరప్రాంతాలకు సర్వీసుల పెంపు
- 60 నుంచి 80 శాతానికి పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో
- విశాఖ రీజియన్‌లో మెరుగుపడ్డ రాబడి



ద్వారకా బస్టాండ్‌లో గురువారం రాత్రి ప్రయాణికుల రద్దీ

సాక్షి, విశాఖపట్నం : రైళ్ల రద్దు ఆర్టీసీకి కలిసొస్తోంది. కొంతకాలంగా రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేస్తోంది. రైల్వే రూట్లలో ఇంటర్ లాకింగ్, ఆటో సిగ్నలింగ్, డబ్లింగ్, స్టేషన్ల ఆధునికీకరణ, రైలు పట్టాల మార్పిడి, మరమ్మతులు తదితర పనుల కారణంగా ఈ నిర్ణయం తీసుకుంది. విశాఖ మీదుగా, విశాఖ నుంచి విజయవాడ, హైదరాబాద్, తిరుపతి వైపు రాకపోకలు సాగించే 32కు పైగా ఎక్స్‌ప్రెస్, పాసింజర్ రైళ్లు రద్దయిన వాటిలో ఉన్నాయి. వీటిలో నిత్యం రద్దీతో నడిచే ప్రధాన రైళ్లు కూడా ఉన్నాయి. ఇలా దాదాపు నెల రోజుల నుంచి రైళ్ల రద్దు కొనసాగుతూనే ఉంది. దీంతో ఈ రైళ్లలో ప్రయాణించాల్సిన వారు ప్రత్యామ్నాయంగా బస్సులను ఆశ్రయిస్తున్నారు. అసలే నష్టాల్లో నడుస్తున్న ఆర్టీసీకి రైల్వే నిర్ణయం ఒకింత ఊరటనిస్తోంది. ప్రయాణికుల రద్దీతో పాటే బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో కూడా (ఓఆర్) కూడా పెరుగుతోంది. ఆర్టీసీ విశాఖ రీజియన్‌లో నెల రోజుల క్రితం వరకు సగటున 60 శాతం ఓఆర్ ఉండగా ఇప్పుడది 80 శాతం, అప్పుడప్పుడు 90 శాతం వరకూ ఉంటోంది. ఇలా బస్సులు ప్రయాణికులతో ఫుల్ అయినప్పటికీ ఇంకా రద్దీ ఉంటే ఆర్టీసీ అధికారులు అందుకనుగుణంగా అదనపు సర్వీసులను నడుపుతున్నారు. సాధారణంగా విశాఖ రీజియన్ నుంచి విజయవాడకు, విజయవాడ మీదుగా వివిధ ప్రాంతాలకు 84, రాజమండ్రికి 24, హైదరాబాద్‌కు 4 సర్వీసులు నడుస్తుంటాయి. ప్రయాణికుల తాకిడి దృష్ట్యా ప్రస్తుతం విశాఖ నుంచి విజయవాడకు రాత్రి వేళ ఆరు, రాజమండ్రికి ఆరు, హైదరాబాద్‌కు మరో రెండు సర్వీసులను అదనంగా తిప్పుతున్నారు. ఇంకా ఇతర ప్రాంతాలకు అవసరమైతే నడుపుతున్నారు. మునుపటితో పోల్చుకుంటే ప్రస్తుతం ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్లు కూడా బాగానే జరుగుతున్నాయి.

వీటికనుగుణంగా ఆర్టీసీ అధికారులు ప్రణాళికతో అదనపు బస్సులను సమకూరుస్తున్నారు. మరికొన్నింటిని సర్దుబాటు చేస్తున్నారు. మరోవైపు పది రోజుల నుంచి పెళ్లిళ్ల ముహూర్తాలు మొదలయ్యాయి. ఇలా రైళ్ల రద్దుతో పాటు పెళ్లిళ్ల సీజను మొదలవడం కూడా ఆర్టీసీలో ప్రయాణాలు సాగించే వారి సంఖ్య పెరగడానికి దోహదపడుతోందని ఆర్టీసీ విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.అప్పలరాజు 'సాక్షి'కి చెప్పారు.

ఆదాయమే..ఆదాయం

ఆర్టీసీ విశాఖ ప్రజా రవాణా విభాగానికి రోజుకు సగటున రూ.87 లక్షల ఆదాయం సమకూరుతుంది. ప్రస్తుతం అది రూ.95 లక్షలకు చేరుకుంది. కొన్ని రోజుల్లో దాదాపు రూ.కోటి వరకు వస్తోంది. రద్దయిన రైళ్ల పునరుద్ధరణ జరిగే వరకు ఆర్టీసీ బస్సుల్లో రద్దీ కొనసాగే అవకాశం ఉంది.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలకు పరిష్కారం

- నేటి నుంచి విధులకు హాజరుకానున్న కార్మికులు
- పోర్టు యాజమాన్యంతో చర్చలు సఫలం
- మీడియా సమావేశంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడి



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, సీపీ త్రివిక్రమ్ వర్మ, డీసీపీ ఆనందరెడ్డి

మహారాణిపేట : రెండు నెలలుగా గంగవరం పోర్టు కార్మికుల చేస్తున్న ఆందోళన పరిష్కారమైందని, శుక్రవారం నుంచి వారంతా విధులకు హాజరవుతారని ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పోర్టు కార్మిక సంఘాల నాయకులతో చర్చలు తరువాత మీడియాతో ఆయన మాట్లాడారు. గంగవరం పోర్టులో 509 మంది కార్మికులు తమ సమస్యలు పరిష్కారం కోసం రెండు నెలలుగా చేపట్టిన ఆందోళన నేపథ్యంలో యాజమాన్యంతో పాటు అఖిల పక్షనేతలతో చర్చలు జరిపామన్నారు. యాజమాన్యం సస్పెండ్ చేసిన ఐదుగురు కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకుందని, అదేవిధంగా ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకరించదన్నారు. 2024 ఏప్రిల్ ఒకటో తేదీన మంజూరు చేసే వార్షిక ఇంక్రిమెంట్‌తో పాటు అదనంగా రూ.1500 చెల్లించడానికి యాజమాన్యం అంగీకరించిందని మంత్రి తెలిపారు. కార్మికులకు ఆరోగ్య పరంగా మెడికవర్, కేర్, అపోలో, గాయత్రి విద్యా పరిషత్ వంటి నాలుగు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకునేలా హెల్త్ కార్డులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రానున్న 15 రోజుల్లో రూ. 10 వేలు బోనస్‌గా చెల్లించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు. ప్రస్తుతం ఆందోళన చేపడుతున్న కార్మికులకు పై అంశాలకు సంబంధించి రాత పూర్వకంగా ప్రొసీడింగ్స్ రూపంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అందజేస్తారని మంత్రి వివరించారు. శుక్రవారం నుంచి విధులకు హాజరు అవుతున్న కార్మికులను అభినందిస్తూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, నగర పోలీసు కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ, డీసీపీ ఆనందకుమార్ రెడ్డి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

1,60,981 మందికి నేడు పెన్షన్లు

రూ.45 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం



మహారాణిపేట : వైఎస్సార్ పెన్షన్ కానుక శుక్రవారం అందజేయడానికి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. సెప్టెంబర్‌లో 3,952 మందికి కొత్త పింఛన్లు మంజూరు చేశారు. జిల్లాలో అన్ని రకాల పింఛన్లు కలిపి మొత్తం (కొత్త,పాతవి కలిపి) 1,60,981 మందికి అందించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. వీటిని పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇందుకు అవసరమైన రూ.45,25,44,000 నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ మొత్తాన్ని గురువారం బ్యాంకుల నుంచి అధికారులు డ్రా చేశారు. డ్రా చేసిన సొమ్మును సంబంధిత అధికారుల ద్వారా వలంటీర్లకు అప్పగించారు. నగర పరిధిలో జీవీఎంసీ అధికారులు, గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ అధికారులు పంపిణీ చేస్తారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి పింఛను పంపిణీ మొదలవుతుంది. 5వ తేదీ వరకు పింఛన్లను అందజేస్తామని డీఆర్‌డీఏ ప్రాజెక్టు అధికారి శోభారాణి తెలిపారు.

వైఎస్సార్ వర్ధంతి నేపథ్యంలో సేవా కార్యక్రమాలు

పార్టీ నేతలకు పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు



సమావేశంలో మాట్లాడుతున్న కోలా గురువులు

మహారాణిపేట: మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పార్టీ అనుబంధం సంఘాల అధ్యక్షులకు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా రక్తదానం, దుస్తుల పంపిణీ కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ప్రతి నియోజకవర్గంలో, ప్రతి వార్డులోను సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పర్యవేక్షకుడు రవిరెడ్డి, అనుబంధ విభాగాల అధ్యక్షులు అద్దాల కృపాజ్యోతి, మన్యాల శ్రీనివాస్, పెంద్ర అప్పన్న, నమ్మి లక్ష్మణరావు, చిక్కా సత్యనారాయణ, వానపల్లి ఈశ్వరరావు, అద్దేపల్లి రవి (బాబు), బయ్యవరపు రాధ, వంకాయల మారుతీప్రసాద్, కోరాడ అప్పలస్వామినాయుడు, ఎజ్జల ప్రేమ్‌బాబు పాల్గొన్నారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



డాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం గురువారం భక్తులతో పోటెత్తింది. శ్రావణ పౌర్ణమి(రాఖీపౌర్ణమి) సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు సత్యదేవుని ఆలయానికి పోటెత్తారు. వేకువజాము 4 గంటల నుంచే క్యూలైన్లు రద్దీగా మారాయి. అనివెట్టి మండపం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు. సామూహిక వ్రతాలు అధిక సంఖ్యలో జరిగాయి. ఉచిత, రూ.20, రూ.200 దర్శనాలు ఏర్పాటు చేశారు. సామూహిక వ్రతాలు జరిగాయి. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్దా మహాలక్ష్మి నగేష్ చర్యలు చేపట్టారు. వన్ టౌన్ పోలీసులు, వివిధ దేవాలయాల సిబ్బంది సేవలందించారు. మధ్యాహ్నం వరకు దర్శనాలు జరిగాయి. సాయంత్రం ఈలయ ప్రాంగణంలో మహిళలు పారాయణ నిర్వహించారు.

రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తి పునరుద్ధరణకు సన్నాహాలు

పరవాడ: అనకాపల్లి జిల్లా పరవాడ సమీపంలోని సింహాద్రి ఎన్టీపీసీ రెండో యూనిట్‌లో సాంకేతిక కారణాల వల్ల ఇటీవల నిలిచిపోయిన విద్యుదుత్పత్తిని పునఃప్రారంభించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సంస్థలోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్ బ్రాయిలర్‌లో అమర్చిన ట్యూబుకు రంధ్రం ఏర్పడడంతో మంగళవారం రాత్రి విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. యూనిట్‌లో సంభవించిన సాంకేతిక సమస్యను సరి చేయడానికి నిపుణులు రంగంలోకి దిగారు. ఈ మరమ్మతులు పూర్తయితే గురువారం రాత్రికి లేదా శుక్రవారం ఉదయానికల్లా రెండో యూనిట్ నుంచి విద్యుదుత్పత్తిని పునరుద్ధరించే అవకాశాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం 1, 3, 4 యూనిట్లు యథావిధిగా పనిచేస్తున్నాయని అధికారులు వెల్లడించారు.

రైల్వే మహిళా ఫుట్‌బాలర్స్‌కు శిక్షణ



శిక్షణలో భాగంగా పోటీపడుతున్న మహిళా ఫుట్‌బాలర్స్

విశాఖ స్పోర్ట్స్ : భారత రైల్వేస్ మహిళా ఫుట్‌బాల్ జట్టు ఎంపికలో భాగంగా శిక్షణా శిబిరం బుధవారం రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. జాతీయ,అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్న స్వర్ణమయి సమాల్, సుప్రియా రౌత్రే, మన్‌ప్రీత్ కౌర్, మొంటీసోరీ చాను, లోచన , నాటబి చాను, జబమని తుడు, రచితామల్లిక్, మమతా, సోనియా, బిష్ణుప్రియ, కమలా దేవి, ఆశాలత దేవి, మనీషా పన్నా, అంజు తమాంగ్, సంజు ఈశిక్షణా శిబిరంలో పాల్గొంటున్నారు. తూర్పుకోస్తా రైల్వే క్రీడా సంఘం వాల్తేర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో పలు రైల్వేలకు చెందిన 35 మంది క్రీడాకారిణులు, కోచ్‌లు పాల్గొంటున్నారు. ఫ్లడ్‌లైట్ల వెలుతురు ఈ శిక్షణా శిబిరాన్ని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్ కుమార్, మనోజ్ కుమార్, క్రీడాధికారి ప్రవీణ్ భాటి, సంయుక్త క్రీడాధికారి అవినాష్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరం ముగిసిన అనంతరం సెలక్షన్ ట్రయిల్స్ నిర్వహించి భారత రైల్వేస్ మహిళా ఫుట్‌బాల్ జట్టును ఎంపిక చేయనున్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్న జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి రాయల సత్యనారాయణ తెలిపారు. జనరల్ సబ్జెక్టులు తెలుగు-1(ఆనందపురం), భౌతిక శాస్త్రం -1(అగనంపూడి), అదే విధంగా ఒకేషనల్ కోర్సుల్లో జీఎఫ్‌సీ (ఎకనామిక్స్) -1 (డాక్టర్ వీఎస్ కృష్ణ ఒకేషనల్ కాలేజీ)పోస్టు ఖాళీగా ఉందన్నారు. సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో పోస్టు గ్రాడ్యుయేషన్ విద్యార్హత కలిగి ఉన్న వారు అర్హులన్నారు. రిటైర్డ్ అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత గల ఆసక్తి ఉన్న అభ్యర్థులు శుక్రవారం సాయంత్రంలోగా విశాఖపట్నం పిఠాపురం కాలనీలోని డీవీఈవో కార్యాలయంలో తగిన ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులు అందజేయాలన్నారు.

సింహగిరిపై 7న శ్రీకృష్ణాష్టమి

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల7న శ్రీకృష్ణాష్టమిని విశేషంగా నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి భ్రమరాంబ తెలిపారు. ఆరోజు రాత్రి ఆలయ బేడామండపంలో శ్రీకృష్ణ జననోద్ధారణ పూజలు, తిరువీధి విశేషంగా నిర్వహిస్తామన్నారు. అలాగే 8న సాయంత్రం 5గంటలకు రాజగోపురం వద్ద ఉట్ల సంబరాన్ని నిర్వహిస్తామన్నారు. 7వ తేదీన సాయంత్రం 6గంటల వరకు మాత్రమే దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే ఆరోజు ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కూడా దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులంతా ఈఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

సీనియర్ వైద్యుల పోస్టుల భర్తీకి 8న ఇంటర్వ్యూలు

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల పరిధిలో సీనియర్ రెసిడెంట్స్ వైద్యులు పోస్టులను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 8న ఆంధ్ర వైద్య కళాశాల్లో ఉదయం 11 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు తెలిపారు. కార్యక్రమానికి అభ్యర్థులు దరఖాస్తుతోపాటు హాజరు కావచ్చని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలన్నీ https@//www.amc.edu.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు 9848314843 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పీజీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయంతో సంయుక్తంగా బొల్లినేని మెడ్‌స్కిల్స్‌లో వివిధ పీజీ, పీజీ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రవేశాల సంచాలకులు ఆచార్య డి.ఏ నాయుడు ఒక ప్రటకటనలో తెలిపారు. రెండేళ్ల కాల వ్యవధి కలిగిన మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌కు ఏదయినా డిగ్రీ పూర్తిచేసినవారు, ఏడాది కాల వ్యవధితో నిర్వహించే పీజీ డిప్లమా ఇన్‌క్రిటికల్ కేర్ టెక్నాలజీ, పీజీ డిప్లమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ, పీజీ డిప్లమా ఇన్ గ్యాస్ట్రోంట్రాలజీ టెక్నాలజీ కోర్సులకు ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బి ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్, బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సులు చేసిన వారు అర్హులు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులో 40 మందికి, ఇతర కోర్సులకు 15 మందికి ప్రవేశం కల్పిస్తారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సుకు ఏడాదికి రూ.45 వేలు ఫీజుగా, ఇతర కోర్సులకు రూ.50 వేలు కోర్సు ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఆసక్తి, అర్హత కలిగిన వారు సెప్టెంబర్ 8వ తేదీలోగా తమ దరఖాస్తులను ప్రవేశాల సంచాలకుల కార్యాలయంలో అదజేయాలి. దరఖాస్తుతో పాటు సంబంధిత విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లను జతపరచాలి. ఇతర వివరాలకు ప్రవేశాల సంచాలకుల వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏయూడో.ఇన్ సందర్శించాలని సూచించారు. పూర్తివివరాలు 72079 53919, 76809 45357 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ప్రాథమిక విద్యకు పటిష్టమైన పునాదులు వేయాలి

విద్యాశాఖ ఆర్జేడీ జ్యోతి కుమారి



మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

విశాఖ విద్య : ప్రాథమిక విద్యకు పటిష్టమైన పునాదులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యాశాఖ ఆర్జేడీ ఎం.జ్యోతికుమారి అన్నారు. నరవలో జరుగుతున్న జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్ (డీఆర్పీ)ల శిక్షణ తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. ఆర్పీలకు పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విద్యార్థుల అభిరుచి మేరకు చదువులు సాగేలా ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఇటువంటి శిక్షణల ద్వారా నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో విజయవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలన్నారు. అదే విధంగా శిక్షణ కేంద్రాన్ని డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష ఏపీసీ బి. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శిక్షణను విజయవంతంగా నిర్వహించాలని ట్రైనర్లకు సూచించారు. కార్యక్రమంలో అడవివరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఇమంది పైడిరాజు, శిక్షణ కో-ఆర్డినేటర్లు ఎల్.సుధాకర్, గొట్టేట రవి, జీసీడీవో ఖాలేషా బేగం పాల్గొన్నారు.

మనస్తాపంలో లారీడ్రైవర్ ఆత్మహత్య

తగరపువలస: భీమిలి మండలం శింగనబంద పంచాయతీకి చెందిన శీర అప్పారావు(41) అనే లారీ డ్రైవర్ మనస్తాపంతో బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భీమిలి పోలీసులు తెలిపిన వివరాలివీ.. అప్పారావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇటీవల కుమార్తెకు కుదిరిన వివాహం ఆగిపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ కారణంగానే పశువులకు కట్టే కన్నితో మేడపైకి వెళ్లి తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్టు భార్య దుర్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతన్ని సంగివలస అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయిందన్నారు. ఎస్‌ఐ గంటా హరీష్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు

పీఎంపాలెం: ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. పెందుర్తి, పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల్లోని 54 రైతు భరోసా కేంద్రాల్లో వివిధ రకాల 1,094 టన్నుల ఎరువులు పంపిణీకి సిద్ధం చేశామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రస్తుతం 646 టన్నుల యూరియా, 392 టన్నుల డీఏపీ, 54 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 91 టన్నుల సింగిల్ ఫాస్ఫేట్, 111 టన్నుల సూపర్ ఫాస్ఫేట్ తదితర ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

మాజీ సైనికుడిపై దాడి కేసులో నిందితుల గుర్తింపు!

పద్మనాభం: రేవిడి పంచాయతీ రౌతులపాలేనికి చెందిన మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణపై జరిగిన దాడి కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను గుర్తించినట్లు తెలిసింది. వీరిలో రేవిడి పంచాయతీ రౌతులపాలేనికి చెందిన ఇద్దరు, భీమునిపట్నం మండలం లక్ష్మీపురానికి చెందిన ఒకరు ఉన్నట్లు సమాచారం. వీరు ముగ్గురూ పరారీలో ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులను పోలీసులు స్టేషన్‌కు రప్పించి.. విచారిస్తున్నారు.

ప్రియుడే హత్య చేశాడు

బీచ్‌రోడ్డు: పోలమాంబ ఆలయం సమీపంలోని ఎల్ఐసీ క్వార్టర్స్‌లో నివాసం ఉన్న కళావతిని ప్రియుడే హత్య చేసినట్లు పోలీసులు గుర్తించి, అతన్ని అరెస్ట్ చేశారు. మూడో పట్టణ సీఐ రామారావు తెలిపిన వివరాలివీ.. ఈ నెల 24వ తేదీన కళావతి హత్యకు గురైన సంగతి తెలిసిందే. మొదట అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పోస్టుమార్టంలో హత్య అని తేలడంతో లోతుగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కళావతిని ఆమె ప్రియుడు రతన్ హత్య చేసినట్లు గుర్తించారు. రతన్‌ను అదుపులోకి తీసుకుని ప్రాథమిక విచారణ పూర్తి చేసి, అనంతరం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై హత్య కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేశామన్నారు.

క్రికెటర్ ఈశ్వర్ ఇకలేరు

- ఆగస్టు 28న గుండెపోటుతో కన్నుమూత
- ఆలస్యంగా వెలుగులోకి..
- సపోర్టింగ్ స్టాఫ్‌గా పేరు ప్రఖ్యాతులు
- ఢిల్లీ క్యాపిటల్స్‌కు ప్రాతినిధ్యం

అక్కిరెడ్డిపాలెం/విశాఖ స్పోర్ట్స్: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీకి చెందిన క్రికెటర్ సోముదల ఈశ్వర్(40) కన్నుమూశారు. ఆగస్టు 28వ తేదీనే ఆయన గుండెపోటుతో మృతి చెందగా.. ఆలస్యంగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలిసిన క్రికెట్ అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు.

విశాఖలో డివిజన్ క్రికెట్ ఆడుతూనే ఈశ్వర్ అంచెలంచెలుగా ఎదిగాడు. ఏసీఏకు చేదోడు వాదోడుగా ఉంటూ.. టోర్నీల నిర్వహణలో సహాయం అందించేవాడు. అలా ఆయన ప్రతిభ ఐపీఎల్‌కు తాకింది. ఎడమ చేతి వాటం బౌలర్ అయిన ఈశ్వర్ ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్ బ్యాటర్లకు నెట్స్‌లో బంతులు విసిరేందుకు సహాయకుడిగా చేరాడు. ఐపీఎల్‌లో సపోర్టింగ్ స్టాఫ్‌గా ప్రస్థానం కొనసాగిస్తూనే.. విశాఖలో జరిగిన ఏపీఎల్ సీజన్‌లో పాల్గొన్నాడు. ఇటీవల ఏపీఎల్ సీజన్ ముగియడంతో అప్పన్నకాలనీలోని తన ఇంటికి చేరుకున్నాడు. ఈ నెల 28న స్నేహితులతో బయటకు వెళ్లి తిరిగి రాత్రి 8.30 గంటలకు ఇంటికి వచ్చాడు. బైక్ దిగి స్టాండ్ వేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడని తల్లి రాములమ్మ తెలిపారు. ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడని బోరున విలపించారు. ఈ వార్త విన్న భారత క్రికెటర్ శ్రీకర్ భరత్.. ఈశ్వర్ ఇంటికి చేరుకుని ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. కాగా.. ఈశ్వర్‌కు వివాహం కాలేదు.

క్రికెటర్ వేణుగోపాల్‌తో సాన్నిహిత్యం

తన 16వ ఏటనే క్రికెట్ ప్రపంచంలోకి అడుగు పెట్టిన ఈశ్వర్‌కు పేదరికం వెంటాడింది. 10వ తరగతి వరకు చదువుకున్న ఈశ్వర్ క్రికెట్టే ప్రపంచంగా భావించాడు. క్రికెటర్ వేణుగోపాల్, ఈశ్వర్ ఇద్దరూ రంజీ సెలక్షన్‌కు వెళ్లారు. వేణుగోపాల్ రంజీకి ఎంపిక కాగా.. ఈశ్వర్‌కు నిరాశే మిగిలింది. అయినా ఏనాడు కుంగిపోలేదు. ఈ క్రమంలో ఈశ్వర్‌పై అభిమానం పెంచుకున్న వేణుగోపాల్ తనతో పాటు పలు మ్యాచ్‌లకు తీసుకువెళ్లేవాడు. ఈశ్వర్ ఫాస్ట్ బౌలర్. గంటకు 150 కి.మీ. వేగంతో బౌలింగ్ చేసేవాడు. ఈశ్వర్ బౌలింగ్ అంటే భారత క్రికెటర్లకు ఎంతో ఇష్టం. అందుకే స్టార్ క్రికెటర్లు ఆయనతో బౌలింగ్ వేయించుకుని నెట్ ప్రాక్టీస్ చేసేవారు. దీంతో ఈశ్వర్‌కు ఎక్కువగా భారత క్రికెట్ క్యాంపుల్లో అవకాశం దక్కేది. అలా సచిన్ టెండూల్కర్, వీరేంద్ర సెహ్వాగ్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లి, దినేష్ కార్తీక్, రికీ పాంటింగ్, డేవిడ్ వార్నర్.. తదితర ఎంతో మంది క్రికెటర్లకు అభిమానిగా మారాడు. ఈశ్వర్‌ను ఎక్స్‌ట్రా ప్లేయర్‌గా అన్ని విషయాల్లో సమానంగా చూసుకునే వారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈశ్వర్ మరణవార్త తెలుసుకున్న క్రికెటర్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. తమ ప్రగాఢ సానుభూతిని కుటుంబ సభ్యులు తెలిపారు.



సచిన్‌కు టాటూ చూపుతున్న ఈశ్వర్(ఫైల్)

ప్రగాఢ సానుభూతి

మా అన్ని శిక్షణ సెషన్స్, మ్యాచ్‌ల్లో జట్టుకు సహాయకారిగా ఉన్న ఈశ్వర్‌ను మిస్ కావడం ఇప్పటికీ నమ్మలేకపోతున్నాం. మా ప్రియమైన సైడ్ ఆర్మ్ స్పెషలిస్ట్ ఈశ్వర్ ఇకలేరు. ఈ క్లిష్ట సమయంలో అతని కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. –ఢిల్లీ క్యాపిటల్స్ మేనేజ్‌మెంట్

ఈశ్వర్ మృతి బాధాకరం

ప్రస్తుత సీజన్ ఐపీఎల్‌లో నేను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు ఆడాను. జట్టుతో పాటు ప్రాక్టీస్ చేసేప్పుడు ఈశ్వర్ నెట్స్‌లో బంతులు విసిరేవాడు. ఇద్దరం విశాఖ వాసులం కావడంతో తొలినాళ్ల నుంచి అతనితో పరిచయం ఉంది. అతను అకస్మాత్తుగా మృతి చెందడం బాధాకరం.

– **భరత్**, భారత టెస్ట్ క్రికెటర్

ఎం.వి. జాగ్ రాధకు ఐదు రోజుల్లోనే మరమ్మతులు

మల్కాపురం: గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ కంపెనీకి చెందిన ఎం.వి.జాగ్ రాధ ఓడను ఐదు రోజుల్లో హిందూస్థాన్ షిప్‌యార్డ్ మరమ్మతులు పూర్తి చేసింది. అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26న ఎం.వి. జాగ్ రాధ ఇక్కడకు వచ్చింది. ఈ నౌక పొడవు 189.99 మీటర్లు కాగా.. వెడల్పు 32.26 మీటర్లు, సామర్థ్యం 58,133 టన్నులు. తమిళనాడులోని కట్టుపల్లి పోర్టులో కార్గో అన్‌లోడింగ్ సమయంలో మరమ్మతులకు గురైంది. దీంతో నౌకను అక్కడి నుంచి షిప్‌యార్డ్‌కు తీసుకొచ్చి మరమ్మతులు చేయించారు.

నేడు అమరావతి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: వాస్కోడగామాలో శుక్రవారం బయలుదేరే వాస్కోడగమా–షాలిమార్ (18048) అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేసినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఖుర్దారోడ్ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఈ రైలు రద్దు చేసినట్లు వెల్లడించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

మాకవరపాలెం: మల్లవరంలో జరుగుతున్న బాల్య వివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. ఈ గ్రామంలోని 15 ఏళ్ల వయసు బాలికకు వివాహం జరుగుతున్నట్టు అందిన సమాచారంతో ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త పోలీసులతో గురువారం గ్రామానికి చేరుకున్నారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ప్రభుత్వ పింఛన్‌తో మా బతుకులకు భరోసా

- సంతృప్తి వ్యక్తం చేసిన 87 శాతం వృద్ధులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ సోషల్ ఎక్స్‌క్లూజివ్, ఇంక్లూజివ్ పాలసీ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో 87 శాతం మంది వృద్ధులు ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ తమకు ఉపయుక్తంగా నిలుస్తోందని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేంద్రం నిర్వహించిన జాతీయ సదస్సులో ప్రచురించిన పరిశోధన పత్రాలతో కూడిన ప్రత్యేక సంచికను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. దేశంలో వృద్ధులు గౌరవప్రదంగా జీవనం సాగిస్తున్నారా?, సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, తదితర అంశాలు వారికి చేరువవుతున్నాయా? అనే అంశాలను భాగం చేస్తూ రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వచ్చిన 23 పరిశోధన పత్రాల సంకలనంగా 'ఎల్డర్లీ పర్సన్స్ ఇన్ ఇండియా–సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ వెల్ఫేర్' పుస్తకాన్ని తీర్చిదిద్దారు. అలాగే సెంటర్ ఆధ్వర్యంలో విశాఖలోని వివిధ మురికివాడల్లో ప్రత్యేకంగా 'ఓల్డేజ్ పెన్షన్ అండ్ సోషల్ ఇంక్లూజివ్ ఆఫ్ ది ఎల్డర్లీ–ఏ స్టడీ ఆఫ్ ది స్లమ్స్ ఆఫ్ విశాఖపట్నం సిటీ' అంశంపై అధ్యయనం చేశారు. ఇందులో 87 శాతం మంది వృద్ధులు ప్రభుత్వం అందిస్తున్న వృద్ధాప్య పింఛన్ తమకు ఉపయుక్తంగా నిలుస్తోందని, సామాజికంగా తమకు గుర్తింపు లభిస్తోందని అభిప్రాయపడ్డారు. 83.5 శాతం మంది ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పెన్షన్ పెంపు తమకు ఎంతో భరోసానిస్తోందని వెల్లడించారు. సర్వే నివేదికను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో విడుదల చేశారు. కార్యక్రమంలో కేంద్రం సంచాలకుడు డాక్టర్ పి.సుబ్బారావు, విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్ రాజు, కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

కొనసాగుతున్న 'బీమా' సినిమా షూటింగ్

కొమ్మాది: బీచ్‌రోడ్డు, విశాఖ పోర్టులో ప్రముఖ నటుడు గోపీచంద్ గురువారం సందడి చేశారు. కన్నడ దర్శకుడు నిమ్మ హర్ష దర్శకత్వంలో బీమా అనే సినిమాలో ఆయన నటిస్తున్న సంగతి తెలిసిందే. కొన్ని రోజులుగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. హీరోయిన్ మాళవిక శర్మ, రఘుబాబు, చమ్మక్ చంద్రలపై గురువారం పలు సన్నివేశాలను చిత్రీకరించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాను కె.కె.రాధా మోహన్ నిర్మిస్తుండగా.. రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.



అభిమానులకు అభివాదం చేస్తున్న హీరో గోపీచంద్

టెన్త్ ఫెయిల్ అయిన విద్యార్థులకు అలర్ట్

- ఈ నెల 15లోగా పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆరిలోవ: పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు 2024లో జరిగే పబ్లిక్ పరీక్షలు రాయడానికి ఈ నెల 15లోగా ఫీజు చెల్లించాలని డీఈవో ఎల్.చంద్రకళ ఓ ప్రకటనలో తెలిపారు. వారికి సంబంధించిన నామినల్ రోల్స్, డాక్యుమెంట్లను హెచ్ఎంలు అదే తేదీలోగా ఆన్‌లైన్‌లో పంపించాలని సూచించారు. విద్యార్థులు https:// www. bse. ap. gov. in/ ను సందర్శించి పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడు, అంతకంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110, మైగ్రేషన్ సర్టిఫికెట్ కావాల్సిన వారు రూ. 80 చెల్లించాలని పేర్కొన్నారు. గడువు దాటితే.. ఈ నెల 16 నుంచి 20 వరకు రూ.50, 21 నుంచి 25వ తేదీ వరకు రూ.200, ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు రూ.500 ఆలస్య రుసుంతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చన్నారు. పాఠశాల నోటీస్ బోర్డుల్లో పూర్తి వివరాలు పొందుపరచాలని హెచ్ఎంలను డీఈవో ఆదేశించారు.

హత్యాయత్నం కేసులో భర్త, అత్తలకు రిమాండ్

ఆరిలోవ: భార్యపై అనుమానంతో భర్త ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతనికి తల్లి సహకరించింది. ఇద్దరినీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ సీహెచ్.సూర్యనారాయణ తెలిపిన వివరాలివీ.. పూర్ణామార్కెట్ సమీపం కొత్తరోడ్డుకు చెందిన వాసుపల్లి నీలిమ ఆరిలోవలోని టీఐసీ పాయింట్ దరి జ్యోతినగర్‌లో ఉంటున్న ఆమె తల్లిదండ్రుల వద్ద కొన్ని రోజులుగా ఉంటోంది. బుధవారం ఆమె భర్త వాసుపల్లి ప్రసాద్, అతని తల్లి ముత్యాలమ్మ కలసి ఆరిలోవ వచ్చారు. భార్యతో ప్రసాద్ మాట్లాడుతూనే.. తన వెంట తీసుకొచ్చిన బ్లేడుతో నీలిమ మెడ, ముఖంపై విచక్షణారహితంగా దాడి చేశాడు. స్థానికులు గమనించి అతని నుంచి నీలిమను రక్షించారు. స్వల్ప గాయాలు కావడంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. అనంతరం అక్కడ నుంచి ప్రసాద్, అతని తల్లి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సూర్యనారాయణ కేసు నమోదు చేశారు. గురువారం ప్రసాద్, అతని తల్లి ముత్యాలమ్మను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. కోర్టు వారిద్దరికీ 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ సూర్యనారాయణ తెలిపారు.

12,13వ తేదీల్లో అఖిల భారత ఆదివాసీ సదస్సు

డాబాగార్డెన్స్: అడవి, అటవీ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర పాలకులు చేసిన చట్టసవరణ రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 12, 13వ తేదీల్లో విశాఖలో అఖిల భారత ఆదివాసీ సదస్సు జరగనుంది. ఆలిండియా ఖేత్ మజ్దూర్ కిసాన్ సభ(ఏఐకేఎంకేఎస్) ఆధ్వర్యంలో జరిగే సదస్సు పోస్టర్‌ను వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం సంస్థ కో కన్వీనర్ ఎస్.ఝాన్సీ, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేష్ పాండా, రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ ఆవిష్కరించారు. నగరంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపం వేదికగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గిరిజన సంఘం నాయకులు వంజం జోగారావు దొర, వి.వి.రమణయ్య, పి.శ్రీనునాయుడు, కె.మోహన్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తెలుగు భాషాభివృద్ధికి హైమావతి విశేష కృషి

డాబాగార్డెన్స్: తెలుగు భాషాభివృద్ధికి ఉపాధ్యాయురాలు హైమావతి విశేష కృషి చేస్తున్నారని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. మాధవధార ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలు అప్పరభుక్త హైమావతికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెలుగు భాషా సేవా పురస్కారంతో గౌరవించింది. ఈ సందర్భంగా మేయర్ తన చాంబర్‌లో గురువారం ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అన్ని భాషల్లో తెలుగు చాలా ప్రత్యేకమైనదన్నారు. హైమావతి ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వర్తిస్తూనే.. ఎన్నో రచనలు చేశారని కొనియాడారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలు హైమావతిని సత్కరిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

పెంటా ఎనర్జీ సర్వీసెస్ కార్మికుల ఆందోళన

అక్కిరెడ్డిపాలెం: హెచ్‌పీసీఎల్‌కు సంబంధించిన కాంట్రాక్ట్ పనులను ప్రధాన కాంట్రాక్టర్ రద్దు చేయడంతో.. సబ్ కాంట్రాక్ట్ కింద పనిచేస్తున్న 130 మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. దీంతో కార్మికులు గురువారం సంస్థ ముందు ఆందోళనకు దిగారు. వివరాలివీ.. ఆటోనగర్ ఏ–బ్లాక్‌లో పెంటా ఎనర్జీ సర్వీసెస్ అనే సంస్థ హెచ్‌పీసీఎల్ సంస్థకు చెందిన కాంట్రాక్ట్ పనులు చేపడుతోంది. సబ్ కాంట్రాక్టర్ ద్వారా 130 మంది వెల్డర్, ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్ కార్మికులు సంస్థలో పనిచేస్తున్నారు. వీరు సకాలంలో పనులు చేయకపోవడంతో పాటు చేపట్టిన పనులు నాసిరకంగా ఉన్నాయని ప్రధాన కాంట్రాక్టర్.. సబ్ కాంట్రాక్ట్‌ను రద్దు చేశారు. దీంతో కార్మికులు రోడ్డున పడ్డారు. అకస్మాత్తుగా తమను విధుల నుంచి తొలగించడం అన్యాయమని, ఆదుకోవాలని ఆందోళన చేపట్టారు. దీనిపై కాంట్రాక్టర్ మాట్లాడుతూ రెండేళ్ల పాటు తమకు కాంట్రాక్ట్ ఉంటుందని.. ప్రస్తుతం పనిచేస్తున్న కార్మికుల్లో కొందరు ఆరు నెలల కిందట, కొందరు రెండు నెలలు, మరికొందరు 20 రోజుల కిందట చేరారని, వీరికి పీఎఫ్ గానీ, ఈఎస్ఐ కానీ వర్తించదన్నారు. వీరికి వేతనాలు మాత్రం ఎప్పటికప్పుడు చెల్లించినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు.. సంస్థ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. సీఐ ఎల్.భాస్కరరావు కాంట్రాక్టర్‌తో మాట్లాడి వివరాలు సేకరించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం

విశాఖ విద్య: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన డాక్టర్ ఉమాగాంధీని గురువారం ఏపీటీఎఫ్ అర్బన్ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ గురుపూజోత్సవం రోజున రాష్ట్రపతి చేతులమీదుగా ఆమె ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోవడం గర్వకారణమన్నారు. డాక్టర్ ఉమాగాంధీ విద్యార్థులు అభ్యున్నతికి చేసిన కృషిని కొనియాడారు. సీతమ్మధార మండల శాఖ ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు దేముడుబాబు, సత్యనారాయణ, దుర్గా కుమారి, శ్రీవిద్య, అరుణ కుమారి, రామ సురేష్, విష్ణు వర్ధన్ నాయుడు, విశ్వేశ్వరరావు, రాజ్ కుమార్, రాము, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు



ఉమా గాంధీని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎగుమతి, దిగుమతుల్లో అపార అవకాశాలు

బీచ్‌రోడ్డు: వ్యాపార రంగంలో ఎగుమతి, దిగుమతులకు సంబంధించి అపారమైన అవకాశాలు ఉన్నాయని యూఎస్ కాన్సులేట్ ప్రిన్సిపల్ కమర్షియల్ ఆఫీసర్ రాఘవన్ శ్రీనివాన్ అన్నారు. సిరిపురంలోని దత్‌ఐలాండ్‌లోని వైజాగ్‌పట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాకు అధిక శాతం సముద్ర ఉత్పత్తులు విశాఖ నుంచే ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. అమెరికాలో రాష్ట్ర విద్యార్థులు 40 శాతం వరకు ఉన్నారన్నారు. అమెరికా–ఆంధ్రప్రదేశ్ సత్సంబంధాలు మెరుగు కోసం చాంబర్ ఆఫ్ కామర్స్ సహాయం కోరారు. కార్యక్రమంలో వీసీసీఐ అధ్యక్షులు ఎం.సందర్శన్ స్వామి, కార్యదర్శి రోనాల్డ్ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవన్ శ్రీనివాన్

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,160
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,150
వెండి(కిలో):	రూ.80,700

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.143
స్కిన్	: రూ.256
స్కిన్‌లెస్	: రూ.266

కోడిగుడ్ల ధరలు

రూ.లలో (వందకు)

విశాఖ	480.00
విజయనగరం	484.00
శ్రీకాకుళం	484.00